క్లుప్తంగా

ఆర్‌యూబీలో లైట్ల ఏర్పాటుకు భూమిపూజ



జడ్చర్ల టౌన్‌: రైల్వేస్టేషన్‌ సమీపంలో ఉన్న ఆర్‌యూబీ కింద లైట్లు లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు మున్సిపాలిటీ నిధులు రూ.8లక్షలతో చేపట్టిన లైట్ల ఏర్పాటు పనులను సోమవారం చైర్‌పర్సన్‌ కోనేటి పుష్పలత టెంకాయ కొట్టి ప్రారంభించారు. లైట్లను వీలైనంత త్వరగా పెట్టాలని ఆమె కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం 4వ వార్డులో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు ముగ్గుపోసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్‌ సారిక, వార్డు కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, సతీశ్‌, నందకిశోర్‌గౌడ్‌, కుమ్మరిరాజు, రమేశ్‌, రహీం, ఉమాదేవి, నాయకులు మినాజ్‌, యాదయ్య, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన కోర్టును ఏర్పాటు చేయడానికి అధికారులు సోమవారం పాత ఎంపీడీఓ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. మరో 15 రోజుల్లో ఇక్కడ కోర్టును ప్రారంభించడం జరుగుతుందని అప్పటి వరకు ఏర్పాట్లు పూర్తి కావాలని తహసీల్దార్‌ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. కోర్టును తాత్కాలికంగా ఇక్కడ ఏర్పాటు చేయడానికి అనుమతి లభించిందని కోర్టు నిబంధనల ప్రకారం వంద అడుగుల వరకు ఎలాంటి క్రయవిక్రయాలకు సంబంధించినవి ఉండరాదని తెలిపారు. అధికారులు, నాయకులు అంజిల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్‌ పాయింట్లు సవరించాలి

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): ఎస్సీ కులాల రోస్టర్‌ పాయింట్లు 22నుంచి 16 పాయింట్లకు సవరించే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకూడదని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదయ్య డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ విజయేందిరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు సూచనలు పాటించకుండా సరైన ఎంపరికల్‌ డేటా లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణతో మాలలు విద్యా, ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, క్యాదర్శి చెన్నయ్య పాల్గొన్నారు.


డిగ్రీకళాశాలలో వెబినార్‌

జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఉమెన్‌ ఎంపవర్‌మెంట్‌ ఆధ్వర్యంలో ఎక్స్‌లెన్స్‌ గ్లోబల్‌ స్కిల్‌ సంస్థ సౌజన్యంతో విద్యార్థులకు ఫైనాన్షియల్‌ లిటరసి ఫర్‌ ఉమెన్‌ అనే అంశంపై వెబినార్‌ నిర్వహించారు. వెబినార్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్‌ డా.సుకన్య మాట్లాడుతూ.. విద్యార్థులు ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. రీసోర్స్‌ పర్సన్‌ సెబిస్మార్ట్‌ ట్రైనర్‌ ప్రదీప్‌ పాండె చిన్న పొదుపు, ప్రణాళికలు, మ్యూచువల్‌ ఫండ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్పొరేట్‌ ప్రోగ్రాం ఆర్గనైజర్‌ నిఖిత చౌదరి విద్యార్థులు చిన్నమొత్తంలో పొదుపు చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమెన్‌ ఎంపవర్‌మెంట్‌ కోఆర్డినేటర్‌ పుష్పలత, అధ్యాపకులు సతీశ్‌, ప్రవీణ్‌కుమార్‌, నందకిశోర్‌, వీరప్రతాప్‌ పాల్గొన్నారు.

సర్దుబాట్లు అశాస్త్రీయం

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: ప్రభుత్వం వర్క్‌ అడ్జెస్ట్‌మెంట్‌ పేరుతో నిర్వహిస్తున్న సర్దుబాట్లు పూర్తిగా అశాస్త్రీయమైనవని డీఈఓ ప్రవీణ్‌కుమార్‌కు ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. బాగా నడుస్తున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా సెక్షన్‌లు, ల్యాంగ్వేజెస్‌లో డబుల్‌ ప్యాటర్న్‌ ఉపాధ్యాయులు ఉన్నారని, వారిని సర్దుబాటు చేయడంతో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వాటిని నిలిపి వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంబాబు, తాహెర్‌, సురేంద్రనాథ్‌, సలాంఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు స్పోకెన్‌ ఇంగ్లిష్‌ తరగతులు



మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: ఇన్ఫోసిస్‌ సహకారంతో స్థానిక బీకేరెడ్డి కాలనీలోని 'మహబూబ్‌నగర్‌ ఫస్ట్‌'లో 190 మంది నిరుద్యోగ యువతకు మొదటి బ్యాచ్‌గా సాఫ్ట్‌ స్కిల్స్‌, స్పోకెన్‌ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని పర్యవేక్షకులు గుండా మనోహర్‌ తెలిపారు. సోమవారం ఈ తరగతులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఆంగ్ల భాషపై అభ్యర్థులు పట్టు సాధించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్‌ ఫస్ట్‌ ఇన్‌చార్జ్‌ నిజలింగప్ప, సెట్విన్‌ కోఆర్డినేటర్‌ విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఎరువులు అందరికీ వస్తాయి

- కలెక్టర్‌ విజయేందిర బోయి
- పీఏసీఎస్‌ను సందర్శించిన కలెక్టర్‌
- యూరియాను పరిమితంగా తీసుకోవాలని రైతులకు సూచన



నవాబుపేట పీఏసీఎస్‌ కేంద్రంలో యూరియా గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్‌ విజయేందిర బోయి

నవాబుపేట: ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అందరికీ ఎరువులు అందుతాయని కలెక్టర్‌ విజయేందిర బోయి సూచించారు. సోమవారం ఎరువుల కోసం వేతలు శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్‌ స్పందించారు. మండల కేంద్రంలో ఎరువులు సరఫరా చేస్తున్న సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించారు. క్యూలైన్‌లో రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డీఏఓ వెంకటేశ్‌, ఏఓ కృష్ణకిషోర్‌, తహసీల్దార్‌ శ్రీనివాస్‌కు పలు సూచనలు చేశారు. ఎరువులు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూలైన్‌లో ఇబ్బందులు రానివ్వొద్దని వెంటవెంటనే క్యూలైన్లు పెద్దగా చేయకుండా రైతులకు ఎప్పటికప్పుడు యూరియా అందించాలని సూచించారు. ఎరువుల సరఫరా విషయంలో అధిక ధరలపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఎరువులకు నిర్ణీత ధరకంటే ఎక్కువ ధర తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మేడం మాకు ఒకేసారి సరిపడా ఎరువులు ఇప్పించండి

క్యూలైన్లు పరిశీలిస్తున్న కలెక్టర్‌ను రైతులు 'మేడం మాకు 2 బస్తాలు ఇస్తున్నారు.. సరిపోవడంలేదు. రోజు లైన్లు కడుతున్నాం. సరిపడా యూరియా బస్తాలు ఒకేసారి ఇచ్చేలా చేయండంటూ విన్నవించారు'. యూరియా విడతలవారీగా వస్తుందని అందరికీ యూరియా అందాలంటే పరిమితిగా తీసుకోవాల్సి వస్తుందని కలెక్టర్‌ బదులిచ్చారు. జిల్లాలో ఎక్కువగా నవాబుపేట మండలానికే యూరియాను అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

సాక్షి ఎఫెక్ట్‌..

ఫీవర్‌ సర్వేను త్వరగా చేయాలి

మండలంలోని కాకర్లపహాడ్‌లో వైద్యసిబ్బంది చేస్తున్న ఫీవర్‌ సర్వే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మూడురోజులుగా సర్వే చేస్తున్న నేటికీ 596 ఇండ్లకుగాను 389 ఇండ్లను సర్వే చేసినట్లు అధికారులు వివరించారు. మిగతావి కూడా వెంటనే చేసి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అపరిశుభ్రతపై నిర్లక్ష్యం చేస్తే నోటీసులు అందించి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అలాగే మండల కేంద్రంలో కేజీబీవీలో విద్యార్థులకు రాత్రికి అందించే భోజనం ముందుగానే తయారు చేసి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కలెక్టర్‌ వెంట డీఎంహెచ్‌వో కృష్ణ, ఎంపీడీఓ జయరాంనాయక్‌, ఎంఈఓ నాగ్యానాయక్‌, జ్యోతి, రాజారాజేశ్వరి, జీవరత్నం, కాంచన తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక



హన్వాడ: మండలంలోని చిన్నదర్పల్లికి చెందిన ఇద్దరు కవలలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్‌ రూరల్‌ మండలంలోని ధర్మాపూర్‌లోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సిరసనోళ్ల సాయితేజ, రవితేజ ఒలింపిక్‌ క్రీడలకు ఎంపికయ్యారు. సాయితేజ షాట్‌పుట్‌, రవితేజ జావెలిన్‌ త్రోలో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయికి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్‌ కవల సోదరులను అభినందిస్తూ.. జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

కిక్‌బాక్సింగ్‌లో విద్యార్థులకు పతకాలు



మహబూబ్‌నగర్‌ క్రీడలు: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 26, 27 తేదీల్లో జరిగిన ఖేలో ఇండియా అస్మిత కిక్‌బాక్సింగ్‌ లీగ్‌లో పాలమూరు విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు స్పోర్ట్స్‌ కిక్‌బాక్సింగ్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు రవికుమార్‌ తెలిపారు. పోటీల్లో శ్రీయ 46, వినూత్న 28, సాయిసృజన 42, దివిజా 18, లక్ష్మీప్రియ 48 కేజీల విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు, అక్షర, దివిజా, వివేక, ఆరాధ్య, లక్ష్మీత్రిలోక్య రజత పతకాలు, ఝాన్సీరెడ్డి, రితిక, అన్విత, లాస్య కాంస్య పతకాలు సాధించారు. బహుమతుల ప్రదానంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవినాయక్‌, సీనియర్‌ విద్యార్థులు యామిని, సాయిలక్ష్మి, జయదీప్‌సింగ్‌ పాల్గొన్నారు.

ఉషుఉమెన్స్‌ లీగ్‌లో జడ్చర్ల విద్యార్థినుల ప్రతిభ



జడ్చర్ల టౌన్‌: సంగారెడ్డిలో జరిగిన ఖేలో ఇండియా సిటీ ఉషుఉమెన్స్‌ లీగ్‌ పోటీల్లో జడ్చర్ల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. సబ్‌ జూనియర్‌ విభాగంలో కారుణ్య గోల్డ్‌ మెడల్‌, బీజే స్మిత సిల్వర్‌ మెడల్‌, హారిక బ్రాంజ్‌ మెడల్‌, జగ్వాన్‌ విభాగంలో షేక్‌ సమీనాబేగం బ్రాంజ్‌ మెడల్‌ సాధించారని ఖేలో ఇండియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ తాజుద్దీన్‌, జిల్లా కోశాధికారి ఇలియాస్‌ బిన్‌సిద్దిఖీ తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థినులకు ఆమెచూర్‌ ఉషూ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్‌, ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌ఉమర్‌ మెడల్స్‌, ప్రశంసాపత్రాలు అందజేశారు. మెడల్స్‌ సాధించిన విద్యార్థినులను ఉషూ మార్షల్‌ఆర్ట్స్‌ అసోసియేషన్‌ కోచ్‌లు కిట్టు, బాలు, సత్యం, శ్రీనివాసులు అభినందించారు.

క్రీడల్లోనూ రాణించాలి

గండేడ్‌: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్నారై ఫోరం చెస్‌ టీం నెట్‌వర్క్‌ ఆధ్వర్యంలో మండలంలోని 135 పాఠశాలల్లో చెస్‌ బోర్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గండేడ్‌ బాలుర ఉన్నత పాఠశాలలో పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్నారై ఫోరం కోఆర్డినేటర్‌ మహిపాల్‌, జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ జనరల్‌ సెక్రటరీ హరీందర్‌రావు, ఫిజికల్‌ డైరెక్టర్‌ రాము, ఉపాధ్యాయులు జనార్దన్‌, ప్రణీత పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

దేవరకద్ర రూరల్‌: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థుల గెలుపునకు ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలని మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హజిలాపూర్‌లో మండల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హనుమంత్‌రెడ్డి, రాజశేఖర్‌, శ్రీకాంత్‌, సురేందర్‌, రాంబాబు, చంద్రమౌళి, పూర్ణిత, జవహర్‌, గ్రామాధ్యక్షుడు కన్నయ్య, జగన్నాథ్‌, ప్రతాప్‌ పాల్గొన్నారు.

అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవద్దు

- డీఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్‌ క్రైం: చట్టపరంగా జీవించే ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వర్గాలుగా విడిపోయి గొడవలు పెట్టడం శాంతిభద్రతలకు ఆటంకం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని వీరన్నపేటలో సోమవారం ప్రజా భద్రత–పోలీస్‌ బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. నేరస్థులు, రౌడీషీటర్లు, అనుమానితులు అన్నివేళల పోలీస్‌ రికార్డుల్లో ఉంటారని తెలిపారు. ఎన్నికల సమయాల్లో గందరగోళం సృష్టించే వారిపై కఠిన చర్యలతోపాటు బైండోవర్‌ తప్పదన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే ఉద్యోగాలు, పాస్‌పోర్ట్‌, విదేశీ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. మహిళలపై గౌరవంగా ఉండాలని వేధింపులకు శిక్షలు తీవ్రంగా ఉంటాయని తెలిపారు. డ్రగ్స్‌, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఇంట్లో పిల్లల ప్రవర్తనపై పెద్దలు నిత్యం గమనిస్తుండాలని తెలిపారు. సైబర్‌ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శీనయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కందూర్‌ ఆలయానికి భక్తుల తాకిడి



రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి తరలి వచ్చిన భక్తులు ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు, పూజలు చేశారు. అదేవిధంగా గౌరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ ఆవరణలో ఉన్న కల్పవృక్షం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలను వెలిగించారు. ఆలయం వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది.

పారిశుద్ధ్య కార్మికులపై ఆగ్రహం



రాజేంద్రనగర్‌లో చెత్తను చూసి కార్మికులపై మండిపడుతున్న కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని రాజేంద్రనగర్‌, సద్దలగుండు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఎక్కడబడితే అక్కడ బహిరంగ ప్రదేశాలు, కూడళ్లలో పోగైన చెత్తాచెదారం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు వీటిని తొలగించాలని కార్మికులు, సిబ్బందిని ఆదేశించారు. అలాగే మోమిన్‌వాడ హైస్కూల్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైందని గోల్‌ మసీదు ప్రాంతవాసులు సోమవారం మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇక్కడ సీసీరోడ్డు నిర్మించాలని కోరారు.


బీసీ నాయకుడిని అవమానించడం తగదు

మెట్టుగడ్డ: మున్నూరు కాపు, బీసీ నాయకుడిని బీజేపీ ఎంపీ డీకే అరుణ, ఆమె అనుచరులు అవమానించడాన్ని మున్నూరు కాపు సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరమోని వెంకటయ్య పేర్కొన్నారు. పట్టణంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడారు. శాంతికుమార్‌ బీసీ నాయకుడు కాబట్టే అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. బీసీ ఓట్లతో గెలిచి బీసీలపైనే అక్కసు వెళ్లగక్కుతారా? బీసీలపట్ల మీరు అనుసరిస్తున్న పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంటయ్య మాట్లాడుతూ.. బీసీ నేతను అవమానించిన అగ్రవర్ణ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బీసీల ఓట్లు బీజేపీకి అవసరం లేదన్నట్లుగా భావించాల్సి ఉంటుందని మండిపడ్డారు. సమావేశంలో రాష్ట్ర యువజన నాయకుడు రమేశ్‌, బుక్కస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీసీలను అణచడమే బీజేపీ సిద్ధాంతమా?

మెట్టుగడ్డ: బీసీలు ఎదగకుండా ఆపేందుకు మరో మారు కుట్రలు మొదలెట్టారని బీసీ మేధావుల సంఘం ఆరోపించింది. సంఘం కార్యాలయంలో సోమవారం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌ విలేకరులతో మాట్లాడారు. బీసీ నాయకుడు శాంతికుమార్‌ ఎదుగుదలను ఓర్చుకోలేకే ఆయనను అవమానిస్తున్నారన్నారు. ఈ విధమైన దుశ్చర్యలకు బీజేపీ అగ్రవర్ణ నాయకులు ప్రోత్సహించడాన్ని బీసీ మేధావుల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు ఇవ్వాలి



కలెక్టరేట్‌ వద్ద ధర్నా చేస్తున్న భోజన కార్మికులు

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి డిమాండ్‌ చేశారు. సోమవారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో వంటలు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్న వారికి రూ.లక్షల్లో బిల్లులను పెండింగ్‌లో పెడితే వారి జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. బిల్లులు ఇవ్వకుండా 10 నెలలుగా వేతనం ఇవ్వలేదని గుడ్లు నూనె, కూరగాయలు తదితర వాటికి పదినెలలుగా బిల్లులు రాలేదని ఆరోపించారు. ఈ కుబేర్‌ రద్దు చేసి తక్షణమే బిల్లులు విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్తయ్య, రాజ్‌కుమార్‌, అరుణ, అంజమ్మ, నరసమ్మ, కవిత, పద్మ, కౌసల్య, యాదమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ జవహర్‌ బాల్‌మంచ్‌ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌ సుదర్శన్‌, ప్రసాద్‌, సమీర్‌ డీఈఓ ప్రవీణ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రహరీ క్లబ్‌లతో పాఠశాల ఆవరణలో మత్తు పదార్థాల వినియోగం, అనుమానాస్పద వ్యక్తుల కలయికలపై నిఘా ఉండే అవకాశం ఉందని, దీన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

బ్రోచర్ల ఆవిష్కరణ

మహబూబ్‌నగర్‌ క్రీడలు: శ్రీహనుమాన్‌ కరాటే అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో వచ్చే నెల 10వ తేదీన జిల్లా కేంద్రంలో నాలుగో నేషనల్‌ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌ నిర్వహిస్తున్నట్లు ఫౌండర్‌, సీనియర్‌ కరాటే మాస్టర్‌ వెంకటేశ్‌ తెలిపారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్లను సోమవారం ఉమ్మడి జిల్లా ఒలింపిక్‌ సంఘం అధ్యక్షుడు ఎస్‌పీ.వెంకటేశ్‌ ఆవిష్కరించారు. నర్సింహులు, హరి, మహేందర్‌ పాల్గొన్నారు.

పాలమూరులో విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

- ముడా చైర్మన్‌ లక్ష్మణ్‌యాదవ్‌, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ నర్సింహారెడ్డి
- తెలంగాణ చౌరస్తాలో ఎమ్మెల్యే యెన్నం, సీఎం రేవంత్‌ చిత్రపటాలకు క్షీరాభిషేకం



తెలంగాణ చౌరస్తాలో ఎమ్మెల్యే, సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: పాలమూరులో విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కృషి చేస్తున్నారని ముడా చైర్మన్‌ లక్ష్మణ్‌యాదవ్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ధర్మాపూర్‌ సమీపంలోని అల్‌ మదీనా ఎడ్యుకేషనల్‌ సొసైటీ ఆధ్వర్యంలో జీకే ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ కళాశాల ఏర్పాటుకు అనుమతులు వచ్చిన సందర్భంగా సోమవారం తెలంగాణ చౌరస్తాలో సంబరాలు చేసుకొని ఎమ్మెల్యే యెన్నం, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్‌ నాయకులు, విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్లు మాట్లాడారు. పాలమూరును ఎడ్యుకేషనల్‌ హబ్‌గా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం, అందుకు సహాయ, సహకారాలు అందిస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ బెక్కరి అనిత, మహిళా కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షురాలు వసంత, నాయకులు చంద్రకుమార్‌గౌడ్‌, సీజే బెనహర్‌, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగంలో మైలురాయి'

ధర్మాపూర్‌ సమీపంలో జీకే ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ కళాశాలకు అనుమతి రావడం పాలమూరుకు విద్యారంగంలో ఒక మైలురాయిలాంటిదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ ముదిరాజ్‌ తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం విద్యారంగం అభివృద్ధి కోసం అంకితమై పనిచేస్తున్నారని తెలిపారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో జైపాల్‌రెడ్డిది కీలక పాత్ర

- టీజీఎంఎఫ్‌సీ చైర్మన్‌ ఒబేదుల్లా కొత్వాల్‌



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: కేంద్రమంత్రిగా ఉమ్మడి జిల్లా అభివృద్ధికి జైపాల్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఒబేదుల్లా కొత్వాల్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో సోమవారం జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్‌ లక్ష్మణ్‌ యాదవ్‌, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌ నర్సింహారెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ అనిత, నాయకులు చంద్రకుమార్‌గౌడ్‌, బెనహర్‌ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎన్‌సీలో..

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జేపీఎన్‌సీఈలో మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహానికి కళాశాల చైర్మన్‌ రవికుమార్‌ పూలమాల వేసి నివాళులర్పించారు. జైపాల్‌రెడ్డి స్మారక స్ఫూర్తి పురస్కారాన్ని మాజీ డీఈఓ విజయ్‌కుమార్‌, వందేమాతరం మాధవరెడ్డికి అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇద్దరికీ అవార్డును ప్రదానం చేయడంతో పాటు రూ.25వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌, సందీప్‌కుమార్‌, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మిడ్జిల్‌ మండలంలో..

మిడ్జిల్‌: మండల కేంద్రంలో బస్టాండ్‌ వద్ద కాంగ్రెస్‌ పార్టీ నాయకులు జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోస్త్‌ స్పెషల్‌ ఫేజ్‌ రిజిస్ట్రేషన్‌

దేవరకద్ర: డిగ్రీలో చేరడానికి విద్యార్థులు దోస్త్‌ స్పెషల్‌ ఫేజ్‌ రిజిస్ట్రేషన్‌ ద్వారా ఆన్‌లైన్‌ దరఖాస్తులు చేసుకోవాలని దేవరకద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోడానికి చివరి తేది అని తెలిపారు. మొదటి ప్రాధాన్యతగా దేవరకద్ర డిగ్రీ కళాశాలను విద్యార్థులు ఎంచుకోవాలని కోరారు. సీట్ల కేటాయింపు ఆగస్టు 3వ తేదీన ఉంటుందని తెలిపారు.

ఫార్మర్‌ రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలి

అడ్డాకుల: వ్యవసాయ భూమి ఉన్న రైతులు తప్పకుండా రైతు గుర్తింపు కార్డులను పొందాలని ఏఓ అనిల్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు గుర్తింపు కార్డు(ఫార్మర్‌ రిజిస్ట్రీ)ను రైతులందరు చేయించుకోవాలని సూచించారు. ఏఈఓకు రైతులు తమ ఆధార్‌కార్డు, మొబైల్‌ నెంబర్‌ను అందజేయాలని చెప్పారు. 50శాతం మంది రైతులు మాత్రమే ఫార్మర్‌ రిజిస్ట్రీ చేయించుకున్నట్లు తెలిపారు. ఆగస్టు 5లోగా రైతులందరూ రైతు గుర్తింపు కార్డు చేయించుకోవాలన్నారు. లేకుంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలకు అర్హులుకారని పేర్కొన్నారు.

మహమ్మదాబాద్‌: మండలంలోని ప్రతి రైతు ఫార్మర్‌ రిజిస్ట్రేషన్‌ తప్పకుండా చేయించుకోవాలని ఏఓ నరేందర్‌ తెలిపారు.

హయ్యర్‌ పెన్షన్‌ అమలు చేయాలి

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు హయ్యర్‌ పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు కోరారు. సోమవారం ఎనుగొండలోని చైతన్య సెంట్రల్‌ స్కూల్‌లో పీఎఫ్‌ సమస్యలపై ఏర్పాటు చేసిన సదస్సులో పీఎఫ్‌ నోడల్‌ ఆఫీసర్‌ శ్రీలతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పీఎఫ్‌ కార్యాలయం నుంచి జారీచేసిన డిమాండ్‌ నోటీసుల ప్రకారం అనేక మంది ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు లక్షలాది రూపాయలు వడ్డీలకు తెచ్చి డీడీల రూపంలో పీఎఫ్‌ కార్యాలయానికి సమర్పించి ఆరు నెలలు దాటినా ఇంతవరకు హయ్యర్‌ పెన్షన్‌ అమలు పరచలేదని, ఎరియర్స్‌ చెల్లించలేదని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు భగవంతు, నర్సింహులు, యాదయ్య, గోపాల్‌, చక్రధర్‌, గౌస్‌, రాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నక్ష బాటను పునరుద్ధరించాలి

అడ్డాకుల: మండల కేంద్రం నుంచి బలీదుపల్లి వరకు వ్యవసాయ పొలాల మీదుగా ఉన్న నక్ష బాటను పునరుద్ధరించాలని రైతులు డిమాండ్‌ చేస్తున్నారు. మండల కేంద్రంలో సోమవారం రైతులు సంతకాలను సేకరించి డీటీ ఖలీద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అడ్డాకుల నుంచి బలీదుపల్లి వరకు గతంలో ఉన్న నక్ష బాటను దాని పక్కన పొలాలున్న రైతులు సాగు చేసుకుంటున్నారని వివరించారు. దీనివల్ల దారిలేక మధ్యలో పొలాలున్న రైతులు తమ పొలాలకు వెళ్లడానికి అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన నక్ష బాటను పునరుద్ధరిస్తే రైతులందరికీ మేలు జరిగే అవకాశం ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు చంద్రం, పాల్‌, వెంకటేశ్‌, వెంకటయ్య, బాలన్న, జయరాజ్‌, కొండన్న తదితరులు ఉన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేవేళ్ల డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్‌ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ విజయేందిర బోయికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా.. దళితులకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. కార్పొరేట్‌ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25శాతం ఉచిత విద్య అమలు చేయడంతోపాటు వివిధ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజన్న, జిల్లా అధ్యక్షుడు రమేశ్‌, అధికార ప్రతినిధి నరేందర్‌, జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ యాదయ్య పాల్గొన్నారు.

40మోటార్ల కేబుల్‌ వైరు, 9గొర్రెల అపహరణ

మిడ్జిల్‌: మండలంలోని వేములలో ఆదివారం రాత్రి దాదాపు 40మంది రైతులకు చెందిన బోరు మోటార్ల కేబుల్‌ వైర్లు, 9గొర్రెలు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. కేబుల్‌ వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడడంతో రైతులకు వేలల్లో నష్టం వచ్చిందని దొంగలను పట్టుకొని న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే రైతు బెట్టరి పెద్ద యాదయ్యకు చెందిన 9గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామసమీపంలోని రోడ్డుకు దగ్గరగా గొర్రెలదొడ్డి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఏదో వాహనం తెచ్చి తరలిస్తుండగా రైతు లేచి కేకలు వేసేసరికి దొంగలు పరారైనట్లు తెలిపారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

భూగర్భజలాలు పెంచడానికే ఇంకుడుగుంతలు

మహమ్మదాబాద్‌: భూగర్భజలాలను పెంచడమే ఇంకుడుగుంతలు తవ్వించే లక్ష్యమని పంచాయత్‌రాజ్‌ ఏఈ ముతీమ్‌ తెలిపారు. సోమవారం మండలంలోని గాధిర్యాల్‌లో డ్రైనేజీల చివర ఇంకుడుగుంతల నిర్మాణాలను ఏర్పాటు చేసేందుకు ముగ్గులు వేశారు. ఆయన వెంట కార్యదర్శి హాజీ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కలెక్టరేట్‌కు పాదయాత్ర



మహబూబ్‌నగర్‌ రూరల్‌: మహబూబ్‌నగర్‌ అర్బన్‌ మండలంలో గత ప్రభుత్వం నిర్మించిన దివిటిపల్లి కేసీఆర్‌నగర్‌ కాలనీలో తిష్టవేసిన సమస్యలు పరిష్కరించాలని డబుల్‌ బెడ్రూం అభివృద్ధి ఐక్యవేదిక, సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేపట్టారు. ఏనుగొండ బైపాస్‌ రోడ్డు నుంచి కలెక్టరేట్‌ వరకు పాదయాత్ర చేశారు. అంతకుముందు వారం రోజులపాటు ఇంటింటి సర్వే చేపట్టి సమస్యలు తెలుసుకున్నారు.

పీవైఎల్‌ రాష్ట్ర కార్యదర్శిగా రామకృష్ణ

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి జిల్లాకు చెందిన రామకృష్ణను రాష్ట్ర కార్యవర్గం నియమించిందని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడిగా పనిచేసిన ఆయన పీవైఎల్‌ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం అభినందించదగ్గ విషయమని తెలిపారు.